సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 20 । జనవరి । 2023



కీడు అధికం!
అందంగా, ఆకర్షణీయంగా కనిపించే కోనోకార్పస్ మొక్కతో లాభాల కన్నా నష్టాలే అధికం. 8లో▸



గ్రహణం వీడేనా?
గతంలో మెరుగైన సేవలు అందించిన పెద్దేముల్ పీహెచ్‌సీకి గ్రహణం పట్టింది. ప్రస్తుత సేవలపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. 9లో▸



రూపురేఖలు మారుస్తాం
చంద్రవంచ గ్రామ పంచాయతీ రూపురేఖలు మారుస్తామని తాండూరు ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి అన్నారు. 9లో▸

చీకట్లను చీల్చేందుకే..

ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపేందుకే ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని కలెక్టర్ నిఖిల అన్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గురువారం పలుచోట్ల నేత్ర వైద్య శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కల్పించిన అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

- 'కంటి వెలుగు'తో అందరి జీవితాల్లో వెలుగులు నిండాలి
- కలెక్టర్ నిఖిల, ఎమ్మెల్యేలు
- జిల్లాలో అట్టహాసంగా ప్రారంభమైన కార్యక్రమం
- ముమ్మరంగా నేత్ర పరీక్షలు, కళ్లద్దాల పంపిణీ



కొడంగల్: పరీక్షల అనంతరం మహిళకు కళ్ల జోడు తొడుగుతున్న కలెక్టర్ నిఖిల

తాండూరు: కంటి వెలుగు బృహత్తర కార్యక్రమమని కలెక్టర్ నిఖిల, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 13, 17 వార్డుల్లో గురువారం నేత్ర వైద్య శిబిరాలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా వంద రోజుల పాటు క్యాంపులు కొనసాగుతాయని స్పష్టంచేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వైద్యారోగ్య శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు సూచించారు. ప్రజలందరూ పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. 33వ వార్డులో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, 7వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్ కంటి వెలుగును ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, కౌన్సిలర్లు మమత, ప్రవీణ్‌గౌడ్, బొంబినా, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నిర్మూలనకే..

పూడూరు: అంధత్వ వ్యాధులను పూర్తిస్థాయిలో నిర్మూలించాలనే సదాశయంతోనే ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని కలెక్టర్ నిఖిల అన్నారు. పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డితో కలిసి చన్గోముల్‌లో శిబిరాన్ని ప్రారంభించారు. క్రమపద్ధతి ప్రకారం పరీక్షలు, చికిత్సలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎమ్మెల్యేతో కలిసి పలువురికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ పాల్వన్‌కుమార్, డీపీఓ తరుణ్‌కుమార్, మండల ప్రత్యేక అధికారి సుధారాణి, ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ మేఘమాల, తహసీల్దార్ మోహన్, ఎంపీడీఓ ఉమాదేవి, సర్పంచ్ మల్లిక, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆజారుద్దీన్, జిల్లా కోఆప్షన్ మాజీ మెంబర్ అజీం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన వారందరికీ..

కొడంగల్: కంటి చూపు లేకపోతే అంతా అంధకారమేనని కలెక్టర్ నిఖిల, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మనిషి శరీరంలో కన్ను అతి ముఖ్యమైన అవయవమని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న శిబిరాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన వారందరికీ ఉచితంగా టెస్టులు చేయడంతో పాటు మందులు, కళ్లద్దాలు అందజేస్తారని తెలిపారు. అవసరమైన వారికి ఆపరేషన్లు నిర్వహిస్తారని స్పష్టంచేశారు. ముఖ్యంగా వృద్ధులకు ఇది మంచి అవకాశమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, ప్రత్యేకాధికారి విమల, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీంద్ర యాదవ్, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్త, కౌన్సిలర్లు మధుయాదవ్, వెంకట్‌రెడ్డి, రమేశ్, మాజీ సర్పంచు రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రేపు శనిఅమావాస్య ప్రత్యేక పూజలు



ఆలయంలో వెలిసిన శనైశ్వరస్వామి

మోమిన్‌పేట: శనిఅమావాస్యను పురస్కరించుకుని భక్తులకు దర్శనమిచ్చేందుకు ఏన్కతలలో వెలిసిన శనైశ్చరుడు ముస్తాబయ్యారు. శనివారం స్వామివారి సన్నిధానానికి వెళ్తే సకల శుభాలు కలుగుతాయని విశ్వాసం. శనైశ్చర స్వామికి అత్యంత ప్రీతికరమైన శనిఅమావాస్య, శని త్రయోదశి రోజున తరలివచ్చే ప్రజల కోసం అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. స్వామివారికి ఇష్టమైన నల్లని దుస్తులు సమర్పించి, నువ్వుల నూనెతో అభిషేకం చేయిస్తే సమస్యలన్నీ తొలగుతాయని పేర్కొన్నారు.

సత్తాచాటిన సంజన



దోమ: రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన సోషల్ టాలెంట్ టెస్ట్‌లో దిర్సంపల్లి పాఠశాలకు చెందిన టెన్త్ విద్యార్థి కె.సంజన సత్తాచాటింది. హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో నిర్వహించిన పోటీల్లో 81 మార్కులు సాధించి, ద్వితీయ స్థానం దక్కించుకుంది. హెచ్‌ఎం వెంకటాచారి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆమెను అభినందించారు.

నేడు పోలెపల్లిలో వేలం

బొంరాస్‌పేట: పోలెపల్లి ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 9నుంచి వేడుకలు మొదలవుతాయి. ఇదిలా ఉండగా ఆలయం వద్ద ఏడాది పాటు కొబ్బరి కాయలు విక్రయించేందుకు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహిస్తామని టెంపుల్ మేనేజర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11.30 గంటలకు అమ్మవారి ఆలయం ఎదుట వేలం ఉంటుందని, రూ.50 వేల డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనవచ్చని సూచించారు. వేలం దక్కించుకున్న వారు ఏడాది పాటు టెంకాయలు విక్రయించవచ్చని తెలిపారు.

బోర్డు మారింది



కొత్తగా ఏర్పాటు చేసిన బోర్డు

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ ఏరియా ఆస్పత్రి బోర్డు ప్రభుత్వ వైద్య కళాశాల, జనరల్ ఆస్పత్రిగా మారింది. ఆ శాఖ ఉన్నతాధికారుల ఆదేశం మేరకు బోర్డు ఏర్పాటు చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. నిన్న మొన్నటి వరకు ప్రభుత్వ కళాశాల ఏర్పాటుపై సంశయంతో ఉన్న ప్రజలు.. బోర్డు ఏర్పాటుతో ప్రభుత్వ కళాశాల వచ్చిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పాడుబడ్డ ప్రకృతి వనం



ఏసీఆర్ కాలనీలోని పట్టణ ప్రకృతి వనం

వికారాబాద్ అర్బన్: ఆహ్లాదం పంచడంతో పాటు పచ్చదనం పెంపొందించాలనే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనాలు పాడుబడ్డ కంచెలుగా మారాయి. హైదరాబాద్ మార్గంలోని ఏసీఆర్ కాలనీలో ఉన్న పట్టణ ప్రకృతి వనం పిచ్చి మొక్కలతో నిండిపోయింది. పట్టణ ప్రకృతి వనం బోర్డుకు తగిగేలా పిచ్చి మొక్కలు పెరిగినా మున్సిపల్ అధికారులు మాత్రం అటువైపు చూడటం లేదు. పచ్చదనంతో కళకళలాడాల్సిన పార్కులు అధ్వానంగా మారడంపై స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

ఆమనగల్లు: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మూడు రోజులుగా ఆమనగల్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కల్వకుర్తి తాలుకాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు గురువారం ముగిసాయి. విజేతలకు సీఐ ఉపేందర్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సుందరయ్య, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, ఏబీఏ అధ్యక్షుడు ప్రసాద్, ఏబీసీ కోశాధికారి కొత్త మల్లేశ్ పాల్గొన్నారు.



నర్సరీలోని మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

చీమల్‌దరిలో అభివృద్ధి భేష్

- అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు బాగున్నాయి
- ఆదర్శంగా పల్లె ప్రకృతివనం, సేంద్రియ ఎరువుల తయారీ
- పంచాయతీ రాజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ రామారావు

మోమిన్‌పేట: పల్లె ప్రగతితో గ్రామాల రూపురేఖలు మారిపోయాయని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్లు రామారావు, జాన్‌వెస్లీ అన్నారు. మండల పరిధిలోని చీమల్‌దరిని గురువారం వారు సందర్శించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు, పల్లె ప్రకృతి వనం బాగున్నాయని సర్పంచ్ నర్సింహారెడ్డిని అభినందించారు. కంపోస్టు షెడ్డు, పంచాయతీ కార్యాలయ భవనం, క్రీడా ప్రాంగణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. పల్లె ప్రకృతి వనంలో నాటిన ఔషధ మొక్కలు, పిల్లలు ఆడుకునే క్రీడా సామగ్రి, యువత కోసం ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు భేష్ అని తెలిపారు. కంపోస్టు షెడ్డులో చేపట్టిన సేంద్రియ ఎరువుల తయారీని మెచ్చుకున్నారు. గ్రామంలో నిర్మించిన భూగర్భ డ్రైనేజీ కారణంగా దోమల బెడద ఉండదని తెలిపారు. దీంతో మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం చాలా తక్కువగా ఉంటుందన్నారు. యాభై ఏళ్ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మోడల్ పంచాయతీ భవనాన్ని నిర్మించడం గొప్ప విషయమని స్పష్టంచేశారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. చీమల్‌దరి గ్రామం అన్ని అంశాల్లో ఆదర్శంగా కనిపిస్తోందని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ శైలజారెడ్డి, ఎంపీఓ యాదగిరి, కార్యదర్శి సుగుణ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక పరిమళం

- ధన్నారం, జినుగుర్తిలో ఘనంగా బోనాలు
- అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు



జినుగుర్తిలో పూజలందుకున్న ఊరడమ్మ

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ధన్నారంలో వెలిసిన గడ్డ మైసమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. అమ్మవారికి భక్తిశ్రద్ధలతో నైవేద్యాలు సమర్పించారు. మహిళలు, యువతులు బోనాలు ఎత్తుకుని ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లారు. వేడుకల్లో జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజులరమేశ్, ఎంపీపీ చంద్రకళకమాల్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కనులపండువగా ఊరడమ్మ జాతర

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తిలో గురువారం గ్రామదేవత ఊరడమ్మ జాతర కనులపండువగా జరిగింది. మూడు రోజులుగా ఈ వేడుకలు కొనసాగుతున్నాయి. చివరి రోజు ఊరడమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయంత్రం డప్పువాయిద్యాలతో మహిళలు బోనాలతో తరలివచ్చారు. అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, భక్తిశ్రద్ధలతో నైవేద్యాలు సమర్పించారు. పంటలు బాగా పండాలని, గ్రామస్తులు అందరూ ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నారు.

బోనమెత్తిన గిరిజన మహిళలు

జినుగుర్తి అనుబంధ గ్రామం జినుగుర్తితండాలోనూ ఊరడమ్మ బోనాలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలతో తరలివచ్చారు. గిరిజనతండా అయినా.. జినుగుర్తితో ఉన్న అనుబంధంతో ఏ పండుగ వచ్చినా అంతా కలిసి సంతోషంగా జరుపుకొంటామని గిరిజనులు చెప్పారు. వీరి వేషధారణతో ఆకట్టుకున్నారు.

ట్రస్ట్ భూమిని కాజేశాడని ఫిర్యాదు

తాండూరు టౌన్: ఉమ్మా ఇస్లామిక్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ భూమిని ఓ సభ్యుడు కబ్జా చేశాడంటూ పలువురు మెంబర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన వివరాలిలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని ఇందిరానగర్‌లో మసీదు నిర్మించాలనే ఉద్దేశంతో ఉమ్మా ఇస్లామిక్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు సభ్యులైన షకీల్ బాబా, హుస్సేన్ అహ్మద్, అబ్దుల్ బాబాజాని పేర్లపై 823 గజాల భూమిని కొనుగోలు చేసి తమ పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ స్థలంలో మసీదు నిర్మాణం కోసం భూమిని ట్రస్టు పేరున రిజిస్ట్రేషన్ చేయించాలని భావించారు. హుస్సేన్ అహ్మద్ ఇందుకు అంగీకరించకపోగా, సదరు భూమిని కబ్జా చేశాడు. దీంతో షకీల్ బాబాతో పాటు ట్రస్టు సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హుస్సేన్ అహ్మద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నో ఎంట్రీ

- కోట్‌పల్లికి పర్యాటకుల రాకను నిలిపేసిన అధికారులు
- బోటింగ్, ఈత బంద్
- ఇటీవల జరిగిన ప్రమాదం నేపథ్యంలో చర్యలు
- వెలవెలబోతున్న ప్రాజెక్టు పరిసరాలు
- రక్షణ చర్యలు చేపట్టాలని టూరిస్టులు, స్థానికుల డిమాండ్



కోట్‌పల్లి ప్రాజెక్టులోకి ఎవరూ వెళ్లకుండా కంచె వేసిన ఫారెస్టు సిబ్బంది



పర్యాటకులు లేక వెలవెలబోతున్న కోట్‌పల్లి ప్రాజెక్టు

ధారూరు: కోట్‌పల్లిలోకి ఎవరూ వెళ్లకుండా ఇరిగేషన్, ఫారెస్టు, పోలీసు శాఖల అధికారులు చర్యలు చేపట్టారు. ప్రాజెక్టు రోడ్డును దిగ్బంధించారు. చెక్‌పోస్ట్ వద్ద నుంచే వాహనదారులు, పర్యాటకులను వెనక్కి పంపించేస్తున్నారు. ఫెన్సింగ్ ఏర్పాటు చేసి నిఘా పెంచారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న పర్యాటకులు ఉసూరుమంటూ తిరిగి వెళ్తున్నారు. గత సోమవారం పూడూరు మండలం మన్నెగూడకు చెందిన నలుగురు యువకులు ప్రాజెక్టు నీటిలో మునిగి మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న యంత్రాంగం పర్యాటకులకు అనుమతిని తాత్కాలికంగా నిలిపేసింది. గత మంగళవారం డీఎస్పీ సత్యనారాయణ ఆధ్వర్యంలో పైమూడు శాఖల ప్రతినిధులు ప్రాజెక్టును పరిశీలించారు. సరదాగా గడిపేందుకు, బోటింగ్ చేయడానికి వచ్చిన యువత నీటిలో సేద తీరేందుకు ప్రయత్నించి ప్రమాదాల బారిన పడుతున్నట్లు నిర్ధారించారు. ఈత రాని వారు లోతైన ప్రాంతాలకు వెళ్లడంతోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నట్లు తేల్చారు. బోటింగ్ చేయడానికి వచ్చిన పర్యాటకులతో పాటు ఇతరులెవరినీ లోనికి వెళ్లనివ్వలేదు. త్వరలోనే ప్రాజెక్టు చుట్టూ ఫెన్సింగ్ వేసి, నీటిలోకి ఎవరూ వెళ్లకుండా పోలీసు సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తారని తెలిసింది. పర్యాటకులు లేకపోవడంతో పరిసరాలు వెలవెలబోయి కనిపిస్తున్నాయి. సుదూరం నుంచి వచ్చిన టూరిస్టులను సైతం అనుమతించకపోవడంతో కొంత నిరాశకు గురయ్యారు.

ఎన్ని రోజులు మూసేస్తారు..?

పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న కోట్‌పల్లి వద్ద రక్షణ చర్యలు చేపట్టకుండా, ఎన్నిరోజుల పాటు ప్రాజెక్టులోని అనుమతులు రద్దు చేస్తారని పర్యాటకులు, స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఏపీలోని పాపికొండలను చూసేందుకు నిత్యం వేలాది మంది వెళ్తుంటారని, గతేడాది పడవ మునిగిన ప్రమాదంలో పలువురు మృతిచెందారని గుర్తుచేశారు. కానీ అక్కడ ఏరోజూ పడవలను నిలిపేయలేదని తెలిపారు. కోట్‌పల్లి వద్ద కఠినమైన ఆంక్షలను అమలు చేయడంతో పాటు కట్టుదిట్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

యూనిట్లు పరి'మితం'!

- మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు తీవ్ర పోటీ
- సబ్సిడీ యూనిట్లకు దరఖాస్తుల వెల్లువ
- 150 యూనిట్లు మంజూరు
- జిల్లా వ్యాప్తంగా 8,060 మంది నుంచి అప్లికేషన్లు



తాండూరు: పేద మైనార్టీ వర్గాలకు చెందిన నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందిస్తోంది. సర్కారు లక్ష్యం మంచిదే అయినప్పటికీ జిల్లాకు కేటాయించిన లక్ష్యం గోరంతే ఉంది. రాయితీ యూనిట్లను కేవలం 150 మంది లబ్ధిదారులకే పరిమితం చేస్తోంది. కానీ రెండు నెలలుగా వీటి కోసం ఎదురు చూస్తున్న ఆశావహులు వేల సంఖ్యలో ఉన్నారు. ఇప్పటికే వీరంతా లోన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇదిలా ఉండగా నెల రోజుల వ్యవధిలోనే గ్రౌండింగ్ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో సంబంధిత అధికారులు ప్రక్రియను వేగవంతం చేశారు.

నాలుగు మున్సిపాలిటీలు, 20 మండలాల్లో ఉన్న మైనార్టీ వర్గాలకు చెందిన అర్హులైన పేదలకు కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం సబ్సిడీ రుణాలు అందజేయనుంది. రూ.లక్ష లోపు యూనిట్‌కు 80శాతం, రూ.2 లక్షల యూనిట్లకు 70శాతం రాయితీ అందిస్తోంది. జిల్లాకు మొత్తం 150 యూనిట్లు మంజూరవగా.. ఇందులో రూ.1 లక్ష విలువైనవి 105, రూ.2 లక్షలవి 45 ఉన్నాయి. అర్హులైన వారందరూ గత నెలలో దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆన్‌లైన్ ద్వారా 8,060 అప్లికేషన్లు వచ్చాయి. ఇందుకోసం అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇతర ఖర్చుల కోసం ఒక్కో దరఖాస్తుదారుడు సుమారు రూ.వెయ్యి వరకు వెచ్చించారు. జిల్లాలోని 565 గ్రామ పంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీలకు సర్కారు మంజూరు చేసిన యూనిట్లు కేవలం 150 మాత్రమే ఉండగా 8,060 దరఖాస్తులు వచ్చిపడ్డాయి. దీంతో రాయితీ పథకాలు ఎవరికి దక్కుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

పట్టణ ప్రాంతాల్లోనే అధికం

జిల్లాలోని తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ పట్టణాల్లోనే మైనార్టీ వర్గాలు అధిక సంఖ్యలో ఉన్నారు. ఫలితంగా అర్బన్ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో అప్లికేషన్లు వచ్చాయి. కాస్త అటుఇటుగా మండలాల నుంచి సైతం అదే స్థాయిలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఒక్కో మున్సిపల్ పరిధిలో పది నుంచి పదకొండు యూనిట్లు, మండలాల వారీగా మూడు నుంచి నాలుగు యూనిట్లకు మించి వచ్చే అవకాశం కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి యూనిట్ల సంఖ్యను పెంచాలని, మెజార్టీ మందికి లబ్ధి జరిగేలా చూడాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

నెల రోజుల్లో అందిస్తాం

మైనార్టీ కార్పొరేషన్ ద్వారా జిల్లాకు రూ.1 లక్ష లోపువి 105, రూ.2 లక్షల లోపువి 45 యూనిట్లు మంజూరయ్యాయి. గత నెలలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించాం. 8,060 మంది అప్లయ్ చేసుకున్నారు. మున్సిపాలిటీలు, మండలాల వారీగా కమిషన్లు, ఎంపీడీఓలు లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు ఫార్వర్డ్ చేశాం. లబ్ధిదారులను సెలెక్షన్ చేసిన తర్వాత రుణాల గ్రౌండింగ్ ప్రక్రియను ప్రారంభిస్తాం.

– సుధారాణి, మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి

భక్తిశ్రద్ధలతో జేపీదర్గా గంధోత్సవం



ఊరేగింపుగా గంధోత్సవం

కొత్తూరు: జేపీదర్గా ఉర్సులో భాగంగా గురువారం వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో గంధోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వక్ఫ్‌బోర్డు చైర్మన్ మసిఉల్లాఖాన్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో కలిసి బాబాకు గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దర్గా అభివృద్ధిలో భాగంగా రూపొందిస్తున్న మాస్టర్‌ప్లాన్‌ను త్వరలో పూర్తిచేసి, సీఎం కేసీఆర్ సూచనలతో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. స్థానికంగా ఉన్న వ్యాపారులతో కొన్ని సమస్యలు ఉన్నాయని.. వాటిని శాంతియుతంగా పరిష్కరించడానికి కొంత సమయం పడుతుందని పేర్కొన్నారు. దర్గా అభివృద్ధిలో భాగంగా ఎవరికీ నష్టం వాటిల్లకుండా ప్లాన్ తయారు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం స్థానిక మైనార్టీ నాయ కులు ఇన్ముల్‌నర్వలో ఉర్దూ మీడియం పాఠశాలను తిరిగి ప్రారంభించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ అజయ్‌నాయక్, నాయకులు ఎమ్మె సత్యనారాయణ, రషీద్, దేవేందర్‌యాదవ్, యాదగిరి, కోస్గి శ్రీనివాస్, జోలీ రవీందర్, గోపాల్‌నాయక్, శ్రీరాములు, సిరాజ్, ఖాజా, మైనార్టీ నాయకులు, వక్ఫ్ బోర్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో అడ్మిషన్లు

బంట్వారం: బంట్వారంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 2023- 24 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సరళారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఫిబ్రవరి 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 16న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆరో తరగతిలో ప్రవేశం పొందే విద్యార్థులకు ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, 7నుంచి 10తరగతుల్లో అడ్మిషన్ పొందే వారికి మధ్యాహ్నం 2నుంచి 4గంటల వరకు ఎగ్జామ్ నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తాండూరు రూరల్‌: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. గౌతాపూర్‌ వద్ద గురువారం మధ్యాహ్నం ఈ ఘటన చోటు చేసుకుంది. కరన్‌కోట్‌ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని సిరిగిరిపేట్‌ గ్రామానికి చెందిన నిడుగుండే బాలప్ప(50) తన టీవీఎస్‌పై తాండూరు నుంచి సిరిగిరిపేట్‌కు వస్తున్నారు. గౌతాపూర్‌ గేటు సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. దీంతో బాలప్పకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆతన్ని పట్టణంలోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాలప్ప మృతిచెందాడు. మృతుడి భార్య చంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్పీడ్‌ బ్రేకర్లు వేయాలి

తాండూరు–చించోళి హైవే రోడ్డు కావడంతో వాహనాల రద్దీ పెరిగిందని, గౌతాపూర్‌ వద్ద స్పీడ్‌ బ్రేకర్లు వేయాలని మాజీ ఎంపీటీసీ జెన్నె నాగప్ప డిమాండ్‌ చేశారు. తరచూ గౌతాపూర్‌ వద్ద రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడంతో సిమెంట్‌ లారీలు, నాపరాతి లారీలు అతివేగంగా వెళ్తున్నాయని చెప్పారు.

దాడికి పాల్పడిన నిందితుల రిమాండ్‌

దోమ : రైతులపై దాడులకు పాల్పడిన నిందితులను గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ విశ్వజన్‌ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మోత్కుర్‌ గ్రామ పరిధిలోని సర్వే నంబర్‌ 548లో గ్రామానికి చెందిన సంపల్లి ఆంజనేయులుకు 4 ఎకరాల 21 గుంటల భూమి ఉంది. ఈ భూమిని ఆనుకుని మహమ్మద్‌ అయోషాఫాతిమా అనే మహిళకు చెందిన ఎకరం 28 గుంటల భూమిని ఉదయభాను అనే ఓ రియల్టర్‌ కొనుగోలు చేసి అగ్రిమెంట్‌ చేసుకున్నారు. పక్క రైతులకు సమాచారం ఇవ్వకుండా సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తుండగా, రైతు సంపల్లి ఆంజనేయులు, వారి కుటుంబ సభ్యులు రియల్టర్‌ను అడ్డుకున్నారు. అడ్డుకున్న రైతులపై రియల్టర్‌ ఉదయభాను, అతని అనుచరులు దాడులకు పాల్పడ్డారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా దాడికి పాల్పడిన వారిలో 15 మందిని గుర్తించి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు. మిగతా నిందితులను త్వరలో పట్టుకుంటామని చెప్పారు.

ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టి



ఉపాధ్యాయులతో టీయూటీఎఫ్‌ ఎమ్మెల్సీ అభ్యర్థి దేవన్నగారి మల్లారెడ్డి

చేవెళ్ల: ఉపాధ్యాయుల సమస్యల సాధనే లక్ష్యంగా కృషి చేస్తానని టీయూటీఎఫ్‌ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి దేవన్నగారి మల్లారెడ్డి అన్నారు. చనువెళ్లి, ఖానాపూర్‌, ఆలూరు, అంతారం, కౌకుంట్ల, తంగడపల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీయూటీఎఫ్‌ స్థాపించి స్వరాష్ట్ర సాధనే లక్ష్యంగా శక్తి వంచన లేకుండా కృషి చేసినట్లు తెలిపారు. రాష్ట్ర సాధనకోసం ఎన్నో ఉద్యమాలు, సదస్సులు నిర్వహించి ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలను ఉద్యమం వైపు మళ్లించినట్లు గుర్తు చేశారు. ఎమ్మెల్సీగా తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న సర్వీస్‌ రూల్స్‌కు శాశ్వత పరిష్కారం, సీపీఎస్‌ రద్దు, ఒత్తిడి లేని విద్య, పదోన్నతులు, బదిలీలు తదితర అంశాల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



అనంతగిరి: కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్‌, అదనపు కలెక్టర్‌



బంట్వారం: కోట్‌పల్లిలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్‌ సునీతారెడ్డి



నవాబుపేట: మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

కంటి వెలుగు ఆరంభం

పేదల కళ్లల్లో ఆనందం

- అంధత్వాన్ని నివారిద్దాం
- ప్రజాప్రతినిధుల పిలుపు
- ఊరూరా ముమ్మరంగా కంటి పరీక్షలు

జిల్లాలో కంటి వెలుగు శిబిరాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఆయా సెంటర్లను కలెక్టర్‌, ఎమ్మెల్యేలు, అధికారులు ప్రారంభించారు. ఊరూరా కంటి పరీక్షలు ముమ్మరంగా జరిగాయి. గ్రామీణులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అంధత్వాన్ని నివారిద్దామని, ఇంటింటా వెలుగులు నింపుదామని ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు.

బంట్వారం: పద్దెనిమిదేళ్లు పైబడిన వారంతా తప్పని సరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని జెడ్పీ చైర్‌ పర్సన్‌ సునీతారెడ్డి అన్నారు. రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని గురువారం ఆమె కోట్‌పల్లి మండల కేంద్రంలో ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటి పరీక్షలతో పాటు అద్దాలు కూడా ఇస్తారని చెప్పారు. కార్యక్రమంలో కోట్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, తహశీల్దార్‌ అష్ఫక్‌రసూల్‌ ,స్పెషల్‌ ఆఫీసర్‌ రాజేశ్వర్‌, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరీక్ష చేయించుకోవాలి

పరిగి: అంధత్వ రహిత సమాజమే అందరి లక్ష్యం కావాలని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్‌ పరిధిలోని మల్లెమోనిగూడలో రెండో విడత కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. కంటివెలుగుతో నిరుపేదలకు మేలు జరుగుతుందన్నారు. గ్రామీణులు ప్రతి ఒక్కరూ కంటి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ ముకుంద అశోక్‌కుమార్‌, ఎంపీపీ అరవింద్‌రావు, పీఏసీఎస్‌ వైస్‌ చైర్మన్‌ భాస్కర్‌ తదితరులు పాల్గొన్నారు.

సీఎం ప్రత్యేక చొరవ

దోమ: కంటి వెలుగుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటా వెలుగులు నింపుతోందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బొంపల్లి పీహెచ్‌సీ సబ్‌ సెంటర్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ అనసూయ, మండల వైద్యాధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామాల్లోని పేదలకు కంటి పరీక్షలు నిర్వహించి కళ్లద్దాలను అందించేలా సీఎం కేసీఆర్‌ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని అన్నారు.

అందరూ కదలిరావాలి

పెద్దేముల్‌: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిందని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఆత్కూర్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకునేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్‌, డీసీసీబీ మాజీ చైర్మన్‌ లక్ష్మారెడ్డి, సర్పంచ్‌ సువర్ణ, తట్టెపల్లి పీఏసీఆస్‌ డైరక్టర్‌ మొగులప్ప, నాయకులు పాల్గొన్నారు.

దృష్టిలోపాలను తరిమేద్దాం

నవాబుపేట: దృష్టిలోపాలను దూరం చేసేందుకు గ్రామీణులు కదలిరావాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎల్లకొండ గ్రామంలో గురువారం కంటి వెలుగు కార్యక్రమాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శిబిరాల్లో నేత్ర పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ భవాని, ఏఎంసీ చైర్మన్‌ ప్రశాంత్‌గౌడ్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ రాంరెడ్డి, తహసీల్దార్‌ రవిందర్‌, ఎంపీడీఓ సుమిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం

పెద్దేముల్‌: కంటి వెలుగు కార్యక్రమం పేదలకు వరమని ఎమ్మెల్యే పైలెట్‌ రోహిత్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మారేపల్లితండాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వైద్యులు కంటి పరీక్ష చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. పేదలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్‌ రాజుగౌడ్‌, ఎంపీపీ అనురాధ, జెడ్పీటీసీ ధారాసింగ్‌, ఎంపీటీసీ స్వప్న, మండల స్పెషల్‌ ఆఫీసర్‌ లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

కుల్కచర్ల: కంటివెలుగు కార్యక్రమం నిరుపేదల జీవితాల్లో నూతన వెలుగులు నింపనుందని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌ రెడ్డి, డీసీసీబీ చైర్మన్‌ బుయ్యని మనోహర్‌ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కుల్కచర్ల, అంతారం, బండవెల్కిచర్ల గ్రామాల్లో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్‌ నాయక్‌, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అందరూ సద్వినియోగం చేసుకోవాలి

ధారూరు: కంటి సమస్య ఉన్న ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్‌ ఆనంద్‌ ప్రజలకు సూచించారు. ధారూరులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. నిష్ణాతులైన డాక్టర్లతో కంటి పరీక్షలు చేయిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్‌ రాహుల్‌ శర్మ, జెడ్పీటీసీ సుజాత, సర్పంచ్‌ చంద్రమౌళి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు వీరేశం పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం

యాలాల: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని యాలాల, బాణాపూర్‌ గ్రామాల్లో వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు సిద్రాల సులోచన, బాలిబాయి, ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, వైస్‌ ఎంపీపీ రమేశ్‌, సొసైటీ చైర్మన్‌ సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆదర్శవంతమైన పాలన

బొంరాస్‌పేట: ముఖ్యమంత్రి కేసీఆర్‌ ఆదర్శవంతమైన పాలనను అందిస్తున్నారని, పాలనను కళ్లార చూడాలని కంటివెలుగు పథకం నెలకొల్పారని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీపీ హేమీబాయి, వైస్‌ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తదితరులున్నారు.

మర్పల్లిలో..

మర్పల్లి: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బట్టు లలిత రమేశ్‌, జెడ్పీటీసీ మధుకర్‌ అన్నారు. గురువారం మండల పరిధిలోని పట్లూర్‌, మర్పల్లి గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అవసరం ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా కంటి అద్దాలు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహేష్‌కుమార్‌, డాక్టర్‌ నేహ, ఏపీఎం పోచయ్య, ఏపీఓ అంజిరెడ్డి, వైస్‌ ఎంపీపీ మోహన్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పరీక్షలు

అనంతగిరి: కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే డాక్టర్‌ మెతుకు ఆనంద్‌ అన్నారు. ఈ మేరకు గురువారం వికారాబాద్‌లోని 31వ వార్డులో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా అధిక సంఖ్యలో నాణ్యత ప్రమాణాలతో కూడిన కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్‌ కలెక్టర్‌ రాహుల్‌శర్మ, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మంజుల, మున్సిపల్‌ కమిషనర్‌ శరత్‌చంద్ర, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జీవరాజ్‌, వైద్యాధికారులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్‌ ఆధ్వర్యంలో ..

కొడంగల్‌: లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 20మంది పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయడానికి నిర్ణయించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 50 మందికి పైగా పరీక్షలు చేశారు. వారిలో 20 మందికి కంటి సమస్యలు ఉండడంతో వారిని మహబూబ్‌నగర్‌ జిల్లా కేంద్రంలోని కందూరు రాంరెడ్డి కంటి వైద్యశాలకు తరలించారు.

పథకం చరిత్రాత్మకం

మోమిన్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం చరిత్రాత్మకమని, ఇది చరిత్రలో నిలిచిపోతుందని జిల్లా పరిషత్‌ వైస్‌ చైర్మన్‌ బి.విజయ్‌కుమార్‌ అన్నారు. మోమిన్‌పేట రైతు వేదిక, ఏన్కతల గ్రామ పంచాయతీలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కంటి వెలుగు కార్యక్రమంలో పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు.



పూడూరు: కంటి అద్దాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

వసతులు కల్పించండి

పెద్దేముల్‌: కంటి వెలుగు శిబిరాల్లో ప్రజలకు ఎలాంటి ఆటంకం కలగకుండా అన్ని వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్‌ రాహుల్‌ శర్మ అన్నారు. గురువారం మండల పరిధిలోని మారేపల్లితండాలో కార్యక్రమాన్ని పరిశీలించారు. శిబిరంలో కల్పించిన వసతులపై ఆరా తీశారు. కంటి పరీక్షలకు వచ్చే ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. అందుకు స్థానిక సర్పంచ్‌ల సహకారం తప్పకుండా ఉండాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆధార్‌ కార్డుతో వచ్చేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. వారితో పాటు మండల వైద్యాధికారి బుచ్చిబాబు, ఎంపీడీఓ లక్ష్మప్ప, ఎంపీఓ షేక్‌సుస్మా, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



మారేపల్లితండాలోని కంటి వెలుగు శిబిరంలో అదనపు కలెక్టర్‌ రాహుల్‌ శర్మ

సమన్వయంతో పనిచేయండి

డీఎంహెచ్‌ఓ పాల్వన్‌కుమార్‌

బంట్వారం: కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయ వంతం చేసేందుకు అందరూ సమన్వయంతో పని చేయాలని డీఎంహెచ్‌ఓ పాల్వన్‌కుమార్‌ అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని మద్వాపూర్‌ కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మెడికల్‌ ఆఫీసర్‌ మానస, క్యాంప్‌ ఇన్‌చార్జి వందనతో మాట్లాడి పలు సూచనలు చేశారు. శిబిరం వద్ద ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. కంటి వెలుగు ప్రాముఖ్యతను ఆయన ప్రజలకు వివరించారు. తప్పని సరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని ఆయన గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలయ్య, తహసీల్దార్‌ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌ గోవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పెద్దేముల్‌: ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి కంటి పరీక్ష చేస్తున్న వైద్యురాలు



కొడంగల్‌లో లయన్స్‌క్లబ్‌ ఆధ్వర్యంలో శిబిరం



మోమిన్‌పేటలో కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్‌ చైర్మన్‌ విజయ్‌కుమార్‌



కుల్కచర్ల: డీసీసీబీ చైర్మన్‌ మనోహర్‌ రెడ్డికి కంటి పరీక్ష..



యాలాల: కళ్లద్దాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

పచ్చని తోటలపై పచ్చి విషం!

- యథేచ్ఛగా రసాయనాల పిచికారీ
- పండ్లు, కాయగూరల పంటలపై స్ప్రే
- తెగుళ్ల నివారణ, తాజాదనం కోసం..
- ప్రమాదకర మందుల వినియోగం
- దెబ్బతింటున్న ప్రజారోగ్యం
- పట్టించుకోని అధికారగణం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: పండ్లు, కాయగూరల తోటలపై శాస్త్రీయ పర్యవేక్షణ కరువైంది. తెగుళ్ల, చీడపీడల బారి నుంచి పంటలను కాపాడుకోవాలనే తపన, కోసిన తర్వాత మార్కెట్లో మంచి ధర రావాలనే ఆశతో రైతులు విచ్చలవిడిగా రసాయన ఎరువులు, పురుగుల మందులు పిచికారీ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల సాగుపై దిశానిర్దేశం చేయాల్సిన ఉద్యాన అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఫలితంగా ఈ కాయగూరలు, పండ్లు తిన్న వారు కేన్సర్‌, శ్వాస సంబంధ సమస్యల బారిన పడే అవకాశం ఉందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

అవగాహన కల్పించే వారేరి?

గతంలో కరివేపాకు, కొత్తిమీర, పుదీన పూర్తిస్థాయి పంటలుగా సాగు చేసేవారు కాదు. ప్రస్తుతం మార్కెట్లో వీటికున్న డిమాండ్‌తో ఏడాదంతా సాగు చేస్తున్నారు. కరివేపాకుకు ఏ తెగులు వస్తే ఏ మందు వేయాలో ఇప్పటికీ స్పష్టమైన ప్రమాణాలు లేవు. వ్యాపారులు ఇచ్చే విషపూరిత రసాయనాలనే చల్లుతున్నారు. పండ్లు, కాయగూరలు సాగు చేసే మెజార్టీ రైతులకు ఏ తెగులుకు ఏ మందు వాడాలో తెలియదు. తెగులు కనిపిస్తే చాలు నేరుగా ఎరువుల దుకాణానికి వెళ్లి, వారిచ్చే రెండు మూడు రకాల మందులు తెచ్చి మోతాదుకు మించి పిచికారీ చేస్తున్నారు. రైతులకు అవగాహన కల్పించేందుకు ఆశించిన స్థాయిలో ఉద్యాన అధికారులు లేరు. జిల్లాలో 38 పోస్టులకుగాను తొమ్మిది మందే ఉన్నారు. ఐదారు మండలాలకు ఒకరు పని చేస్తున్నారు. ఒక ఊరికి ఒకసారి వెళ్తే.. మళ్లీ ఆ ఊరికి వెళ్లేందుకు మూడు నెలలు దాటుతోంది.

ఎడాపెడా పిచికారీ

గ్రేటర్‌ పరిధిలో 1.20 కోట్ల జనాభా ఉన్నట్లు అంచనా. వీరికి రోజుకు సగటున 1,978 మెట్రిక్‌ టన్నుల కాయగూరలు అవసరం. వీటిలో సగటున 791 మెట్రిక్‌ టన్నులు జిల్లా నుంచే సరఫరా అవుతున్నాయి. మరో 1,187 మెట్రిక్‌ టన్నులు ఇతర జిల్లాల నుంచి వస్తున్నాయి. 12,453 ఎకరాల్లో టమాటా సాగు చేస్తుండగా, 3,032 ఎకరాల్లో క్యారెట్‌, 1,540 ఎకరాల్లో పచ్చిమిర్చి, 1,524 ఎకరాల్లో బీట్‌ రూట్‌, 1,432 ఎకరాల్లో బెండ, 1,321 ఎకరాల్లో వంకాయ తోటలు సాగవుతున్నాయి. మరో 3,598 ఎకరాల్లో పాలకూర, మెంతి, పుదీన ఇతర ఆకుకూరలు సాగవుతున్నట్లు అంచనా. సుమారు 30 వేల ఎకరాల్లో జామ, బొప్పాయి, మామిడి, ద్రాక్ష, డ్రాగన్‌ ఫ్రూట్‌, ఇతర పండ్ల తోటలు సాగవుతున్నాయి. చీడపీడల నివారణ కోసం రైతులు తరచూ వీటిపై పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు.

2021-22లో పండ్ల తోటల సాగు (మెట్రిక్‌ టన్నుల్లో)

పంట పేరు	సాగు విస్తీర్ణం	ఉత్పత్తి
పండ్లు	29,385	1,62,166
కూరగాయలు	33,363	3,08,460
పువ్వులు	6,285	42,035
సుగంధ ద్రవ్యాలు	1,475	4,280
ఔషధ/సుగంధ మొక్కలు	203	1,600
ఆగ్రో ఫారెస్ట్రీ	1,715	-
పట్టు పరిశ్రమ	140	-

ఏదిపడితే అది వినియోగం

ప్రమాదకరమైన 'మోనోక్రోటోపాస్‌' మందులను పండ్లు, కాయగూరల పంటలపై పిచికారీ చేస్తున్నారు. 'ఆసిఫెట్‌–75' మందును పత్తి, వరి, కుసుమ పంటలకే వాడాల్సి ఉంది. ఇది చల్లిన 15 రోజుల తర్వాత పంటను కోయాల్సి ఉన్నా.. బెండ, వంగ, చిక్కుడు పంటలపై పిచికారీ చేసిన రెండో రోజే కోస్తున్నారు. 'ఆల్ఫాసైపర్‌ మైత్రిన్‌ 40'ని పత్తిలో పచ్చపురుగు నివారణ కోసమే వాడాల్సి ఉండగా కాయగూరలపై కూడా చల్లుతున్నారు. చీడపీడల బెడద ఎక్కువగా ఉండే ఆకుకూరలు, బెండ, టమాటా, వంకాయ, చిక్కుడు, కాకర, మిర్చి వంటి పంటలపై రోజువిడిచి రోజు చల్లుతున్నారు. రసాయన అవశేషాలు పూర్తిగా మాయం కాకుండానే కోసి మార్కెట్‌కు తరలిస్తున్నారు. తయారీ కంపెనీలు వ్యాపారులకు అధిక కమీషన్‌ ఆశ చూపిస్తున్నాయి. వీటికి కక్కుర్తి పడుతున్న వ్యాపారులు తేలికపాటి తెగుళ్ల నివారణకు కూడా విషపూరిత రసాయనాలు అంటగడుతున్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉన్నా ఇప్పటి వరకు పట్టించుకున్న పాపాన పోలేదు.

మొక్క అందం.. కీడు అధికం!

- పచ్చదనం పేరుతో విచ్చలవిడిగా కోనోకార్పస్‌ మొక్కల పెంపకం
- శ్వాసకోశ, అలర్జీ వంటి వ్యాధులు వస్తాయంటున్న వైద్యులు
- రాష్ట్ర ప్రభుత్వం సైతం గతంలో హెచ్చరికలు
- అయినా పెంచుతున్న అధికారులు




హైదరాబాద్‌ రోడ్డు డివైడర్‌ మధ్యలో ఏపుగా పెరిగిన కోనోకార్పస్‌ మొక్కలు

వికారాబాద్‌ అర్బన్‌: అందంగా ఆకర్షణీయంగా కనిపించే ఈ మొక్క పేరు కోనోకార్పస్‌. ఈ మధ్య కాలంలో రోడ్డు డివైడర్ల మధ్యలో, రోడ్డు పక్కన ఎక్కువగా పెంచుతున్న మొక్కలు ఇవి. మొక్క ఎండి పోవడం అనేది ఉండదు. నాటిన రోజు నుంచి ఓ దశ వరకు ఎదుగుతూనే ఉంటుంది. ఇలాంటి మొక్కలను ఇంటి ముందు పెరట్లో పెంచుకుంటే ఎంత బాగుంటుందోనని అనుకునే వారే ఎక్కువ. ఈ మొక్క చూడటానికి ఎంత అందంగా కనిపిస్తుందో మనుషులకు అంత కీడు చేస్తుందనే ప్రచారం కూడా ఉంది. మనుషులకు రకరకాల ఇబ్బందులు తెచ్చి పెట్టడంతో పాటు, పర్యావరణాన్ని సైతం కలుషితం చేస్తుందని తెలిసినా అధికారులు విచ్చల విడిగా కోనోకార్పస్‌ మొక్కలను పెంచుతున్నారు. ఈ మొక్కలను పలు దేశాలు నిషేధించాయనే విషయాన్ని సోషల్‌ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. డాక్టర్లు కూడా ఈ విషయాన్ని ధ్రువీకరిస్తున్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం కూడా గతంలోఈ మొక్కలను పెంచుకోవద్దని ప్రచారం చేసింది. అయినా అధికారులు హరితహారంలో భాగంగా విచ్చల విడిగా పెంచుతున్నారు. గత ఏడాది వికారాబాద్‌ మున్సిపల్‌ పరిధిలోని ఎన్నెపల్లి నుంచి ఆర్టీసీ డిపో వరకు రోడ్డు డివైడర్‌ మధ్యలో నాటిన ఈ మొక్కలు ఇప్పుడు ఏపుగా పెరిగాయి. కొత్తగా ఏర్పడుతున్న వెంచర్లలో వంద శాతం ఈ కోనోకార్పస్‌ మొక్కలనే నాటుతున్నారు.

హరితహారంలో అధికంగా..

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న హరితహారం కార్యక్రమంలో అత్యధికంగా ఈ మొక్కలనే నాటుతున్నారు. ఈ మొక్కల వల్ల తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయనే ఉద్దేశంతో గతంలో రాష్ట్ర ప్రభుత్వం కోనోకార్పస్‌ మొక్కలను నాటవద్దని చెప్పినా వినడం లేదు. పల్లెలు, పట్టణాల సుందరీకరణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుండటంతో అధికారులు తొందరగా పెరిగి పచ్చదనం ఉట్టిపడే కోనోకార్పస్‌ మొక్కలను ఎంచుకుంటున్నారు. తొందరగా ఏపుగా పెరిగే ఈ మొక్కలు పర్యావరణం, జీవ వైవిధ్యాన్ని దెబ్బతీస్తుందని ప్రచారంలో ఉంది. కోనోకార్పస్‌ మొక్కలు వదిలే గాలి వల్ల శ్వాసకోశ వ్యాధులతో పాటు అలర్జీ వచ్చే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసే మొక్కలు పెంచకపోవడం మంచిదని పట్టణ ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పజారోగ్యాం కాపాడే మొక్కలను మాత్రమే నాటితే మంచిదని అంటున్నారు.

ఏమాత్రం ఉపయోగం లేనివి



కోనోకార్పస్‌ మొక్కలు ఏమాత్రం ఉపయోగం లేనివి. నీరు లేక పోయినా ఏపుగా పెరుగుతాయి. ఈ మొక్కలతో అలర్జీ, ఆస్తమా వ్యాధులు సోకుతున్నాయనే కారణంతో చాలా దేశాల్లో వీటిని నిషేధించారు. మనవద్ద చాలా పెంచుతున్నారు. వీటికి బదులుగా పర్యావరణాన్ని పరిరక్షించే మొక్కలు నాటితే మేలు. ప్రమాదం ఉందని తెలిశాక ఈ మొక్కలను నిషేధించడమే మంచిది.

– డాక్టర్‌ సందీప్‌, చిన్న పిల్లల వైద్యుడు